హైదరాబాద్ ఆఫీస్ ఖాళీ

ఈ నగరానికి ఏమైంది. అవును.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను చూస్తే ఇలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయిప్పుడు.

ఒకప్పుడు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయిన ఆఫీస్ స్పేస్.. ఇప్పుడు ఆదరణ లేక కళావిహీనంగా కనిపిస్తున్నది. అద్దెకు తీసుకునేవారే కరువైపోయారు మరి.

గతంలో ఇక్కడ కార్యాలయాలను ఏర్పాటు చేసుకొనేందుకు క్యూ కట్టిన కార్పొరేట్లు.. ప్రస్తుతం ముఖం చాటేస్తున్నారు. దీంతో లక్షల చదరపు అడుగుల్లో కార్యాలయ స్థలాలు ఖాళీగా ఉన్నాయంటూ రియల్ ఎస్టేట్ రిపోర్టులు వస్తున్నాయి.

వృథాగా 284 లక్షల చదరపు అడుగుల్లో కార్యాలయ స్థలాలు

దేశంలోనే అత్యధికం.. ఆ తర్వాత ఢిల్లీ-ఎన్‌సీఆర్

అద్దెకు పెద్దగా ఆసక్తి చూపని కార్పొరేట్లు: వెస్టియన్

న్యూఢిల్లీ, మే 1: హైదరాబాద్‌లో కార్యాలయ స్థలాలకు పెద్దగా ఆదరణే లేకుండాపోయింది. ఒకప్పుడు దేశంలోని ప్రధాన నగరాలను వెనక్కినెడుతూ ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో దూసుకుపోయిన రాష్ట్ర రాజధాని నగరానికి ఇప్పుడు డిమాండ్ కనిపించడం లేదు. ఏడాదిన్నర క్రితం వరకు హైదరాబాద్‌లో ఆఫీస్‌ను ఏర్పాటు చేసేందుకు ఉత్సాహం చూపిన కార్పొరేట్లు.. ప్రస్తుతం ఆసక్తి చూపించడం లేదు. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ విడుదల చేసిన తాజా గణాంకాలే ఇందుకు నిదర్శనం.

284 లక్షల చదరపు అడుగుల్లో..

దేశంలోని 7 ప్రధాన నగరాల ఆఫీస్ స్పేస్ మార్కెట్‌పై వెస్టియన్ సర్వే చేసింది. దీని వివరాల ప్రకారం హైదరాబాద్‌లోనే గరిష్ఠంగా కార్యాలయ స్థలాలు వృథాగా పడిపోయి ఉన్నట్టు తేలింది. ఏకంగా 284 లక్షల చదరపు అడుగుల్లో ఆఫీస్ స్పేస్ ఖాళీగా ఉన్నదని వెస్టియన్ ఈ సందర్భంగా వెల్లడించింది. ఈ ఏడాది మార్చి నాటికి హైదరాబాద్‌లో మొత్తం అందుబాటులో ఉన్న ఆఫీస్ స్పేస్ 1,620 లక్షల చదరపు అడుగులు. ఇందులో 284 లక్షల చదరపు అడుగులు ఖాళీగానే ఉన్నది. ఇది మొత్తం స్టాక్‌లో 17.5 శాతానికి సమానం. కార్పొరేట్ కంపెనీలు అద్దెకు తీసుకొనేందుకు పెద్దగా ఆసక్తి చూపట్లేదని వెస్టియన్ పేర్కొన్నది. కాగా, గతంలోనూ ఆయా నగరాల్లో ఆఫీస్ స్పేస్ ఖాళీలుండేవి. అయితే హైదరాబాద్‌లో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపించేది. దాంతో ఆఫీస్ స్పేస్ గిరాకీలో నగరం ఎప్పుడూ టాప్‌లో ఉండేది. మిగతా నగరాలతో పోల్చితే లీజింగ్ పెద్ద ఎత్తున జరిగేది మరి. కానీ మారిన పరిస్థితులతో ఇప్పుడు ఖాళీల్లో టాప్‌లో ఉంటున్నది.

ఆగిన కొత్త నిర్మాణాలు

ఇప్పటికే నిర్మాణం పూర్తయ్యి అందుబాటులో ఉన్న ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ అంతంతమాత్రంగానే ఉండటంతో కొత్త నిర్మాణాలు దాదాపుగా ఆగిపోయాయి. రియల్టర్లు, ఆఫీస్ స్పేస్ నిర్మాణ కంపెనీలు నూతన ప్రాజెక్టులకు దూరంగా ఉంటున్నాయి. ఫలితంగా సిమెంట్, ఉక్కు, ఇతర నిర్మాణ అనుబంధ రంగాలు కుదేలయ్యాయి. వాటిమీద ఆధారపడుతున్న పరిశ్రమలు, వ్యాపారులు, ఉద్యోగులు, కూలీల భవిష్యత్తు ఆందోళనలో పడింది. నిజానికి హైదరాబాద్‌లో ఖాళీగా ఉన్న కార్యాలయ స్థలాలు మునుపు ఇంకా ఎక్కువ (19 శాతం)గానే ఉండేవి. కానీ కొత్త ప్రాజెక్టులు రాకపోవడంతో ఇవి కాస్త తగ్గాయి. కాగా, హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, పుణె నగరాలపై వెస్టియన్ సర్వే చేసింది.

బీఆర్ఎస్ హయాంలోనే బాగుబాగు

ఉమ్మడి రాష్ట్రంలో నత్తనడకన సాగిన అభివృద్ధి.. విభజన అనంతరం తెలంగాణలో పరుగులు పెట్టింది. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలు అన్ని రంగాలను బలపర్చాయి. ఐటీ, ఫార్మా, ఆటో, ఏవియేషన్, డిఫెన్స్ ఇలా కీలక రంగాలు వృద్ధిపథంలో పయనించాయి. ఇది ఇక్కడి నిర్మాణ రంగానికి ఊహించని స్థాయిలో డిమాండ్‌ను తెచ్చిపెట్టింది. ముఖ్యంగా ఆఫీస్ స్పేస్‌కు గిరాకీని అమాంతం పెంచేసింది. దేశ, విదేశీ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు భారీగా ముందుకొచ్చాయి. భారత్‌లోకి రావాలంటే హైదరాబాద్‌నే ప్రధాన కేంద్రంగా చేసుకోవాలన్నంతగా డిమాండ్ నెలకొన్నదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఈ క్రమంలోనే మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి అనేక సంస్థలు హైదరాబాద్‌లో బడాబడా ఆఫీసులను తీసుకొచ్చాయి. మరెన్నో స్టార్టప్‌లూ కొలువుదీరాయి. ఫలితంగా ఆఫీస్ మార్కెట్ వేగంగా విస్తరించింది. దాదాపు పదేండ్ల టీఆర్ఎస్, బీఆర్ఎస్ పాలనలో ఇలాగే సాగిందంతా. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అంతా తలకిందులైంది. ఏడాదిన్నరగా పెట్టుబడులు రాక మార్కెట్‌లో స్తబ్ధత నెలకొన్నది. అందుకు ఆఫీస్ స్పేస్ మార్కెట్ అద్దం పడుతున్నది.

- దేశంలోని ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఆఫీస్ స్పేస్ ఖాళీలు. ఆ తర్వాత ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఉన్నాయి.
- బెంగళూరు (2,805 లక్షల చదరపు అడుగులు) తర్వాత ఎక్కువగా ఆఫీస్ స్పేస్ అందుబాటులో ఉన్నది హైదరాబాద్ (1,620 లక్షల చదరపు అడుగులు)లోనే.
- బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో జోరుగా డిమాండ్-సప్లై. ఇప్పుడు డిమాండ్ లేకపోవడంతో సప్లై కూడా ఆగిపోయింది.
- ఈ ఏడాది జనవరి-మార్చిలో దేశీయంగా ఆఫీస్ స్పేస్ లీజింగ్ 34 శాతం పెరిగి 179.6 లక్షల చదరపు అడుగులకు చేరిక.
- జీసీసీలు, ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు, బ్యాంకింగ్, ఆర్థిక, బీమా రంగాల నుంచి కనిపించిన డిమాండ్.

దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఖాళీ ఆఫీస్ స్పేస్ నిల్వలు

నగరం	లక్షల చ.అడుగుల్లో
హైదరాబాద్	284
ఢిల్లీ-ఎన్‌సీఆర్	232
బెంగళూరు	210
ముంబై	125
కోల్‌కతా	79
చెన్నై	60
పుణె	56

జీఎస్టీ వసూళ్లు ఆల్‌టైమ్ హై

ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, మే 1: జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.2.10 లక్షల కోట్లతో పోలిస్తే 12.6 శాతం అధికమని పేర్కొంది. జీఎస్టీ అమలులోకి వచ్చిన జూలై 1, 2017 తర్వాత ఇదే అత్యధిక వసూళ్లు కావడం విశేషం. ఈ ఏడాది మార్చి నెలలో రూ.1.96 లక్షల కోట్లు వసూలయ్యాయి. గడిచిన నెలలో వసూలైనదాంట్లో దేశీయంగా రూ.1.96 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 10.7 శాతం మేర పెరిగాయి. వీటిలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.48,634 కోట్లు వసూలవగా, స్టేట్ జీఎస్టీ కింద రూ.59,372 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ.69,504 కోట్లు, సెస్ రూపంలో రూ.12,293 కోట్లు వసూలయ్యాయి. దేశ ఆర్థిక రంగం బలంగా ఉందన్నడానికి ఈ జీఎస్టీ వసూళ్లే నిదర్శనమని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే పన్ను వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మైలురాయి దాటిందని డెలాయిట్ ఇండియా పార్టనర్ ఎంఎస్ మణి తెలిపారు. అత్యధిక ఉత్పత్తి, వినిమయ రాష్ర్టాల్లో జీఎస్టీ వసూళ్లలో వృద్ధి 11 శాతం నుంచి 16 శాతం మధ్యలో నమోదవడం వల్లనే రికార్డు స్థాయికి చేరుకున్నాయన్నారు.

ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు

ఏప్రిల్ 2025	రూ.2.37 లక్షల కోట్లు
ఏప్రిల్ 2024	రూ.2.10 లక్షల కోట్లు
మార్చి 2025	రూ.1.96 లక్షల కోట్లు

వాహన విక్రయాలు అంతంతే

న్యూఢిల్లీ, మే 1: మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉన్నప్పటికీ గడిచిన నెలలో వాహన విక్రయాలు ఆశించిన స్థాయిలో నమోదయ్యాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలు మారుతి సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా విక్రయాలు పెరగగా..టాటా మోటర్స్, హ్యుందాయ్ సేల్స్ తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ మహీంద్రా రెండో స్థానానికి, టాటా మోటర్స్ మూడో స్థానానికి ఎగబాకింది. కానీ, రెండో స్థానంలో కొనసాగిన హ్యుందాయ్ ఈసారి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నది. మారుతి అమ్మకాలు ఏడు శాతం అధికమయ్యాయి.

ఏప్రిల్ నెలలో వాహన అమ్మకాలు

సంస్థ	2025	2024	వృద్ధి(శాతంలో)
మారుతి	1,79,791	1,68,089	7
మహీంద్రా	84,170	====	19
టాటా మోటర్స్	72,753	77,521	-6.1
హ్యుందాయ్	60,774	63,701	-5
టయోటా కిర్లోస్కర్	27,324	20,494	33
ఎంజీ మోటర్స్	5,829	4,725	23
కియా ఇండియా	23,623	19,968	18
హోండా కార్స్	3,360	4,351	-23
ద్విచక్ర వాహనాలు			
టీవీఎస్ మోటర్	4,43,896	3,83,615	16
సుజుకీ మోటర్‌సైకిల్	1,12,948	99,377	14
రాయల్ ఎన్‌ఫీల్డ్	86,559	82,043	6

కాగ్నిజెంట్‌లో 20 వేల ఉద్యోగాలు

న్యూఢిల్లీ, మే 1: అమెరికాకు చెందిన ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్..ప్రస్తుతేడాది 20 వేల మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్టు ప్రకటించింది. కృత్రిమ మేధస్సుతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై మంచి పట్టున్న ఉద్యోగులను రిక్రూట్ చేసుకోనున్నది. నూతన టెక్నాలజీ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్టు, గతేడాది రిక్రూట్ చేసుకున్నవారి కంటే రెండింతలు అధికంగా ఈసారి నియమించుకోనున్నట్టు కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్ ఎస్ తెలిపారు. ప్రస్తుతం సంస్థలో 3,36,300 మంది ఉద్యోగులు ఉన్నారు.

దిగొస్తున్న బంగారం ధర

హైదరాబాద్‌లో తులం రూ.2,180 డౌన్ • 24 క్యారెట్ రూ.95,730

హైదరాబాద్, మే 1: నిన్నమొన్నటిదాకా ఆకాశమే హద్దుగా పరుగులు పెట్టిన బంగారం ధరలు.. ఇప్పుడు అంతే వేగంగా దిగొస్తున్నాయి. గురువారం ఒక్కరోజే హైదరాబాద్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల రేటు రూ.2,180 తగ్గి రూ.95,730 వద్ద స్థిరపడింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం విలువ కూడా రూ.2,000 పడిపోయి రూ.87,750 వద్ద నిలిచింది. నిజానికి గత వారం రోజులుగా గోల్డ్ రేట్లు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. అంతకుముందు తులం రేటు తొలిసారి లక్ష రూపాయల మార్కును దాటిపోయిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలు, వివిధ కారణాలతో పతనమైన స్టాక్ మార్కెట్ల వల్ల దేశీయ మార్కెట్‌లో పుత్తడి ధరలు వరుసగా పెరుగుతూపోయాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వస్తున్న బలహీన సంకేతాల నడుమ ధరలు దిగువ ముఖం పడుతున్నాయి.



లోహియా బిస్కెట్ ప్లాంట్

హైదరాబాద్, మే 1: హైదరాబాద్‌కు సమీపంలో మేడ్చల్ వద్ద వరల్డ్ క్లాస్ బిస్కెట్ తయారీ యూనిట్‌ను ప్రారంభించింది లోహియా గ్రూపు. ఏడు ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో ప్రస్తుతం నెలకు 1000 టన్నుల బిస్కెట్లు తయారుకానుండగా, వచ్చే నాలుగేండ్లలో ఈ సామర్థ్యాన్ని 5 వేల టన్నులకు పెంచుకోనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వచ్చే నాలుగేండ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించింది.

హైదరాబాద్‌లో ఆల్ట్.ఎఫ్ కో-వర్కింగ్ ఆఫీస్

హైదరాబాద్, మే 1: కో-వర్కింగ్ నిర్వహణ సంస్థ ఆల్ట్.ఎఫ్..హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని తెరిచింది. 56 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 1,200 మందికి పైగా కూర్చోవడానికి వీలుంటుందని పేర్కొంది. సౌకర్యవంతమైన కార్యాలయాల మార్కెట్ భారీ వృద్ధిని నమోదు చేసుకుంటున్న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని కంపెనీ కో-ఫౌండర్ యోగేశ్ అరోరా తెలిపారు. ఒక్కో డెస్క్ నెలకు రూ.8 వేల చొప్పున చార్జీ వసూలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం సంస్థ..ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్‌లలో కో-వర్కింగ్ కార్యాలయాలను నిర్వహిస్తున్నది.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు జాతీయ స్థాయి అవార్డు

అవార్డు అందుకుంటున్న రవీందర్ రెడ్డి

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మే 1 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు జాతీయ స్థాయి అత్యుత్తమ అవార్డు దక్కింది. ఈ మేరకు ఢిల్లీలోని ఆసియా టుడే మీడియా సంస్థ నిర్వహించిన 'ప్రపంచ విద్యా సమ్మిట్ 2025' కార్యక్రమంలో 'తెలంగాణలో ఉత్తమ మహిళా డిగ్రీ కళాశాల'గా గుర్తించి అవార్డు ప్రకటించగా, కేంద్ర సహాయ మంత్రి భూషణ్ దరి, ఎఫ్ఐజేఐ కమిషన్ కౌన్సిలర్ నీలేశ్‌కుమార్, కేంద్ర డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిస్ట్ చేతుల మీదుగా కళాశాల కరెస్పాండెంట్ వీ రవీందర్‌రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ, అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యా రంగంలో అఖండ ప్రతిష్టను సంపాదించుకుంటూ మరో గౌరవాన్ని తన ఖాతాలో వేసుకుందని తెలిపారు. తెలంగాణ తరపున తమ కళాశాలకు అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. అల్ఫోర్స్ మహిళా కళాశాల విద్యార్థినుల సర్వోత్తమ వేదిక అని పేర్కొన్నారు. గడచిన సంవత్సరాల్లో విద్య, నైపుణ్యం, శాస్త్రీయ దృష్టి నైతిక విలువలు, ప్రాంగణ నియామకాలు, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, విద్యార్థులు, అధ్యాపకుల నిష్పత్తి, కళాశాల సాధించిన ప్రగతిని పరిగణనలోకి తీసుకొని జాతీయ స్థాయిలో ఉత్తమ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలగా గుర్తించి అవార్డు ప్రకటించారని తెలిపారు. ఈ విజయాన్ని సాధించడంపై ప్రిన్సిపాల్, అధ్యాపకవర్గం, విద్యార్థులు రవీందర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

డ్రగ్స్ మత్తు మహమ్మారిని గ్రామాల్లోకి రానివ్వొద్దు



దుద్దెనపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వాణీదేవి

సైదాపూర్, మే 1: చాకలి ఐలమ్మ, సమ్మక్క సారలమ్మ వారసులమైన మహిళలమే మన పిల్లలను వ్యసనాల బారిన పడకుండా చూడాలని, డ్రగ్స్ లాంటి మత్తు మహమ్మారిని మన గ్రామాల్లోకి రాకుండా పోరాటం చేసి యువతను కాపాడుకోవాలని ఎమ్మెల్సీ వాణీదేవి పిలుపునిచ్చారు. హుస్నాబాద్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం సైదాపూర్ మండలం వెన్నంపల్లి, సోమారం, లక్ష్మన్నపల్లి, ఆరెపల్లి, ఎక్లాస్‌పూర్, దుద్దెనపల్లి గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర కొనసాగింది. దుద్దెనపల్లిలో జరిగిన అవగాహన సభలో ఎమ్మెల్సీ వాణీదేవి పాల్గొని ప్రసంగించారు. యువత మత్తుకు మద్యానికి ఇతర వ్యసనాలకు బానిసై అర్ధాంతరంగా చనిపోవడం బాధాకరమన్నారు. మన దేశ సమగ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని మహిళా లోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం చెన్నబోయిన కుమారస్వామి, జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గ చైర్మన్ కవ్వ లక్ష్మీరెడ్డి, జేఏసీ కోఆర్డినేటర్ డ్యాగల సారయ్య, జేఏసీ నాయకుడు ఎదులాపురం తిరుపతి, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్, ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్ల వెంకటస్వామి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల విద్యార్థుల సత్తా



గుగులోత్ విశ్వంత్ 553 మార్కులు

కొత్తపల్లి, మే 1: కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి వి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వీరిలో 8 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించగా 15 మంది విద్యార్థులు 450కిపైగా మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారన్నారు. వీరిలో గుగులోత్ విశ్వంత్ 553, అడవి దీపక్ 548, సాయి వర్షిణి 521 మార్కులు సాధించి సత్తాచాటారు. వీరిని కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, హెచ్‌ఎం కె శ్రీనివాస్ అభినందించారు.

అటెస్టేషన్ కోసం అగచాట్లు

- గెజిటెడ్ అధికారుల సంతకాలకు ఇబ్బందులు
- పొంటెల తరబడి కార్యాలయాల ఎదుట పడిగాపులు
- అంతగా పట్టించుకోని పచ్చ పెన్నుదారులు
- మీసేవ నిర్వాహకుల మధ్యవర్తిత్వం
- ఎంతో కొంత ముట్టజెపితేనే పని

కరీంనగర్ కలెక్టరేట్, మే 1 :కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌కు చెందిన ఓ చిరువ్యాపారి ఇటీవల తన కూతురు వివాహం చేశాడు. కల్యాణ లక్ష్మి పథకం ద్వారా లబ్ధిపొందేందుకు దరఖాస్తు చేయాలనుకున్నాడు. ఇందుకోసం అవసరమైన ప్రతులు తెచ్చి ఫారం పూరించాడు. పెళ్లితంతు వాస్తవమేనని ధ్రువీకరించడం మాత్రమే మిగిలింది. ఇందుకోసం తమ ప్రాంతంలోని గెజిటెడ్ హోదా కలిగిన అధికారి సంతకం చేయాల్సి ఉంది. దీనికోసం తెలిసిన వారిని అడిగితే ప్రభుత్వ పాఠశాలలో గల ప్రధానోపాధ్యాయుడిది లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యుడిదైనా, లేక ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారిగా పనిచేస్తున్న అధికారిదైనా సంతకం చేయించాలంటూ చెప్పగా, ఆయన పై కార్యాలయాల చుట్టూ వారం రోజుల పాటు తిరిగాడు. అయినా, సంతకం మాత్రం చేయలేదు. చివరకు తనకు తెల్సిన మీసేవ నిర్వాహకుని వద్దకెళ్లి విషయం వివరిస్తే.. ''ఓహ్ ఇంతేనా.. ఇదెంత పని నేను చేయిస్తా.. కాకపోతే కొంచెం ఖర్చయితది'' అంటూ సెలవిచ్చాడు. అయినా, మంచిదే అంటూ జేబులో నుంచి తీసి కొంత ముట్టజెప్పాడు. సదరు వ్యక్తి గంటలోపే సంతకం పని పూర్తి చేయించాడు.''

ఇది ఆ ఒక్క చిరువ్యాపారి బాధ మాత్రమే కాదు.. జిల్లాలో నిత్యం వందల మంది వివిధ అవసరాల కోసం గెజిటెడ్ అటెస్టేషన్ కోసం పడరాని బాధలు పడుతున్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల కోసం, కోర్టులకు అందజేసే జిరాక్స్ ప్రతులపై, బర్త్ సర్టిఫికెట్లలో పేరు మార్చడం, పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ల మంజూరీకి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించే క్రమంలో అవసరమయ్యే జిరాక్స్ ప్రతులపైనా గెజిటెడ్ అధికారుల సంతకం అనివార్యం కాగా, ఇందుకోసం సంబంధిత అధికారుల కార్యాలయాల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేయాల్సి వస్తున్నది. అధికారులు వారి వారి పనుల్లో నిమగ్నమై ఉండే సందర్భాల్లో కొద్దిసేపు వేచి ఉండాలంటూ సూచించి అనంతరం వచ్చిన వారి గురించి మర్చిపోతుండగా, అధికారి పిలుపు కోసం కార్యాలయాల గుమ్మాల ఎదుట పడిగాపులు కాస్తున్న దృశ్యాలు ఇటీవలి కాలంలో పెరిగాయి. రోజురోజుకూ పెరుగుతున్న పని ఒత్తిడితో కూడా అధికారులు సంతకాలు పెట్టేందుకు అంతగా ఆసక్తి కనబర్చడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, అనేక మంది కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోతున్న సందర్భాలే అధికంగా ఉంటున్నాయని వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వారి బాధలు వర్ణనాతీతం కావడంతో చేసేదేమీ లేక మీసేవ కేంద్రాల నిర్వాహకులను ఆశ్రయిస్తున్నారు. వీరి ఇబ్బందులను ఆసరాగా చేసుకుని వారు అందినకాడికి దండుకుంటూ, సంతకాలు చేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ ఇబ్బందులు భరించలేక కొంతమంది ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు కూడా చేయడం లేదనే చర్చ కూడా జరుగుతుండడం గమనార్హం.

బీఆర్ఎస్ కార్యకర్తకు వినోద్ కుమార్ పరామర్శ



ఓదెలును పరామర్శిస్తున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

విద్యానగర్, మే 1: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కరీంనగర్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గోదావరిఖని పట్టణానికి చెందిన వేల్పుల ఓదెలును గురువారం మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ పరామర్శించారు. ఓదెలుకు ధైర్యం చెప్పిన వినోద్ కుమార్, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఇటీవల ఎల్కతుర్తిలో జరిగిన బీ ఆర్ ఎస్ భారీ బహిరంగ సభకు హాజరై తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓదెలు గాయపడ్డారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు జక్కుల నాగరాజు, శేఖర్ తదితరులు ఉన్నారు.

కార్మికులకు అండగా బీఆర్ఎస్ పార్టీ



కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎంపీపీ చిలుక రవీందర్, నాయకులు

చొప్పదండి, మే 1: కార్మికులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎంపీపీ చిలుక రవీందర్ భరోసా ఇచ్చారు. గురువారం రుక్మాపూర్ గ్రామంలో శ్రీ హనుమాన్ హమాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రుక్మాపూర్ గ్రామంలో దివంగత హమాలీ కార్మికుడు మైలారం రాజయ్య భార్య లక్ష్మికి బీఆర్ఎస్ పార్టీ తరపున రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ ఆదేశాల మేరకు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మాచర్ల సౌజన్య- వినయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి సౌజన్యంతో గ్రామాధ్యక్షుడు తొంటి పవన్ కుమార్, నాయకులు, కార్యకర్తల సహకారంతో ఆర్థిక సాయాన్ని అందించి కార్మికుడి కుటుంబానికి భరోసా కల్పించామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కర్రె శ్రీనివాస్, ముద్దసాని చిరంజీవి, మాజీ ఎంపీటీసీ ముద్దసాని రంగన్న, జాగృతి నియోజకవర్గ ఇన్‌చార్జి మ్యాకల తిరుపతి, మాజీ వార్డు సభ్యులతో పాటు హమాలీ సంఘం అధ్యక్షుడు తాటికొండ ఓదెలు, ఉపాధ్యక్షుడు పానుగంటి కుమార్, బీఆర్ఎస్ నాయకులు లంక రవి, పోలే రాజకొమిరెల్లి, పెద్ది మల్లయ్య, పెద్ది రమేశ్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ నిలిపేయాలి

కలెక్టరేట్, మే 1 : ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో గల కర్రెగుట్టల్లో మావోయిస్టులపై కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని అఖిలపక్ష సంఘాల నాయకులు, మేధావులు, విద్యావంతులు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని కార్ఖానాగడ్డలో గల ఓ ఫంక్షన్‌హాలులో తెలంగాణ మేధావుల ఫోరం జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నక్సలైట్ల కోసం గాలింపు పేరుతో ఎన్‌కౌంటర్లు చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని పరిహసించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. చర్చలకు సిద్ధమేనంటూ మావోయిస్టులు ప్రకటిస్తున్నా పాలక ప్రభుత్వాలు ఏకపక్షంగా వ్యవహరిస్తుండడం దారుణమైన నిర్ణయమన్నారు. తెలంగాణ కార్మిక సమాఖ్య ప్రతినిధి రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో నిలువ ఉన్న విలువైన ఖనిజ నిక్షేపాలను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రతోనే కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఆదివాసీ సంక్షేమ సంఘాల జేఏసీ కన్వీనర్ రవీందర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఆదివాసీ హక్కులు కాపాడేందుకు తీర్మానాలు చేస్తే సరిపోదని, ఆదివాసీలపై జరుగుతున్న మూకుమ్మడి దాడిని నిలువరించేందుకు కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మేధావుల ఫోరం జిల్లా కన్వీనర్ వెంకటేశ్ మాట్లాడుతూ, మనిషి ప్రాథమిక హక్కులు కాపాడేందుకు పాలకులు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో తెలంగాణ ఎడ్యుకేటెడ్స్ ఫోరం జిల్లా ప్రతినిధి రావుల రాజేశం, ఎస్‌యూ విద్యార్థి నేత ప్రదీప్‌రావు, నల్లబెల్లి రజినీకాంత్, తన్నీరు గోపాల్, వొద్దమల్ల రాజేశ్, అరికెల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి



రైతులతో మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్

గంగాధర, మే 1: ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్ సూచించారు. గురువారం గంగాధర వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గంగాధర కొనుగోలు కేంద్రంలో వెయిట్ లాస్ పేరిట ఓ రైతుకు చెందిన 5.20 క్వింటాళ్ల ధాన్యం కోత విధించగా, రూ.12,064 నష్టం వచ్చినట్లు కొన్ని వార్తా పత్రికల్లో(నమస్తే తెలంగాణ కాదు) తప్పుడు కథనాలు ప్రచురించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రెండు బస్తాల ధాన్యం మాత్రమే కట్ అయినట్లు, రూ.1600 మాత్రమే నష్టం వచ్చినట్లు సదరు రైతు నోట్ రాసి ఇచ్చాడని తెలిపారు. మిల్లు యాజమాన్యంతో మాట్లాడి రైతు నష్టపోయిన రూ.1600 కూడా ఇప్పిస్తామన్నారు. రైతులు అసత్య ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తప్పతాలు లేకుండా ధాన్యం తీసుకువస్తే 40 కిలోల 600 గ్రాములు తూకం వేస్తామని తెలిపారు. ఇక్కడ సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, నాయకులు జారతి సత్తయ్య, సామంత్రులు శ్రీనివాస్, కార్యదర్శి రమేశ్, రైతులు ఉన్నారు.

టీబీ కిట్ ఆవిష్కరణ

కొడిమ్యాల, మే 1: మండల కేంద్రంలో గురువారం టీబీ కిట్‌ను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, మండల వైద్యాధికారి పరమేశ్వరి, సీహెచ్‌వో రాజశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై ఆస్తి పన్ను వసూళ్లలో జమ్మికుంట ప్రథమ స్థానం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

జమ్మికుంట, మే 1: ఐదు శాతం రాయితీపై ఆస్తి పన్ను వసూళ్లలో జమ్మికుంట మున్సిపల్ 55.4శాతంతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని బల్దియా కమిషనర్ ఎండీ అయాజ్ తెలిపారు. గురువారం ఆయన జమ్మికుంట మున్సిపల్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 13 కార్పొరేషన్లను కలుపుకొని 151 మున్సిపల్స్ ఉండగా.. ఒక్క జమ్మికుంట మాత్రమే రూ.కోటి 89లక్షల ఆస్తి పన్ను వసూళ్లను చేసి రికార్డు సృష్టించిందని పేర్కొన్నారు. గత సంవత్సరం ఆస్తి పన్ను వసూళ్లలో కూడా జమ్మికుంట మొదటి స్థానంలో నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. పన్నులు కట్టేందుకు ముందుకు వచ్చిన ప్రజలతో పాటూ అన్ని వర్గాలకు కృతజ్ఞతలు తెలిపారు. స్టేట్‌లో ప్రథమ స్థానంలో నిలిచినందుకు మున్సిపల్ కార్యదర్శి నుంచి ప్రోత్సాహకం కింద జమ్మికుంట బల్దియా అభివృద్ధి కోసం రూ.3కోట్లు మంజూరు కానున్నట్లు వెల్లడించారు. వాటిని కూడళ్లు, పార్కుల కోసం కేటాయిస్తామని, జమ్మికుంటను మరింత గొప్పగా తీర్చిదిద్దుతామని చెప్పారు. సమావేశంలో మేనేజర్ రాజిరెడ్డి, ఆర్ఐ భాస్కర్, అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.